క్లుప్తంగా

చిత్తారమ్మ జాతరపై నేడు ఎమ్మెల్యే సమీక్ష

సుభాష్‌నగర్: ఈ నెల 22న గాజులరామారం చిత్తరమ్మ దేవి జాతరను పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద అధ్యక్షతన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ ఓ ప్రకటన తెలిపారు. సమావేశానికి పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్, వైద్య, సంబంధిత శాఖల అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

రంగారెడ్డినగర్: కార్మిక, శ్రామిక వర్గ ప్రజల కోసం సీపీఐ నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందని పార్టీ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్ హమాలీ అడ్డా వద్ద హమాలీ కార్మికుల సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి శాఖ కార్యదర్శి జార్జ్ నాయకత్వం వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఉమా మహేష్, కార్యవర్గ సభ్యుడు స్వామి కార్మికులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ సభ్యత్వం పొందాలంటే మొదట పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ సభ్యుల సిఫార్సు మేరకే సభ్యత్వం ఇస్తామన్నారు. నేడు అనేక రాజకీయ పార్టీలు ఆయా పార్టీల సభ్యత్వం తీసుకుంటే ఇన్సూరెన్స్, ఇతర పారితోషికాలు ఇస్తామని చెప్పి సభ్యత్వం తీసుకుంటున్నాయన్నారు. సీపీఐ సభ్యులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, సమాజంలో మంచి పేరు తెచ్చుకుంటూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాము, కోశాధికారి నర్సింహారెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, సత్తిరెడ్డి, రాములు, భీమేశ్, సుంకిరెడ్డి, భీమేశ్, కనకయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



డబ్బాలపై ఆరా తీస్తున్న సీఐ రమణారెడ్డి

సుభాష్‌నగర్: ప్రభుత్వం దిల్ సంస్థకు అప్పగించిన స్థలంలో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. సుభాష్‌నగర్ డివిజన్ శివాలయనగర్ సమీపంలోని గాజులరామారం సర్వే నంబర్ 49/6లో దిల్ సంస్థ కేటాయించిన స్థలం ఇప్పటికే 70% ఆక్రమణ గురైంది. మిగతా స్థలంలో సూరారం – బాలానగర్ ప్రధాన రోడ్డు ఆనుకుని కొందరు డబ్బాలు వేయడంతో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దుండిగల్ సీఐ రమణారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కబ్జాలపై ఆరా తీశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని, కబ్జాల పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



రింగ్ బస్తీలో తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభమైన దృశ్యం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారం కానుంది. జలమండలి ఆధ్వర్యంలో సోమవారం పైపులైన్ వేసేందుకు రోడ్డు తవ్వకాలు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుది దశలో ఎస్‌టీపీ రెండో గేట్ పనులు



కొనసాగుతున్న ఎస్‌టీపీ ప్లాంట్ రెండో ఎగ్జిట్ పనులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ రెండో గేటు పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్లాంట్‌లోకి వచ్చి వెళ్లేందుకు ఒకే మార్గం ఉండటంతో టిప్పర్లు, చెత్త సేకరణ ఆటోరిక్షాలు ఒకేసారి వచ్చినపుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై ఆటో రిక్షావాలాలు రాంకీ కూకట్‌పల్లి జోన్ హెడ్ రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా రాంకీ సంస్థ రెండో గేటు పనులను ప్రారంభించింది. సుమారు రూ.11 లక్షలతో చేపడుతున్న రెండో ఎగ్జిట్ పనులు వారం రోజుల్లో పూర్తవుతాయని ఆయన 'సాక్షి' కి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



ఒకేషనల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుతుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను నివేదించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

- సుభాష్‌నగర్ పైప్ లైన్ రోడ్డులో ఏళ్ల తరబడి నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పురపాలక మంత్రి కేటీఆర్ రూ.56 కోట్ల నిధులను కేటాయిస్తూ జీవో విడుదల చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాలనీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, మహిళా నాయకురాలు పద్మజరెడ్డి, శ్రీనివాస్‌రాజు, ఇస్మాయిల్, నర్సింగ్‌రావు ఉన్నారు.
- మాజీ మున్సిపల్ చైర్మన్ కె.ఎం.పాండు జ్ఞాపకార్థం రూ. కోటితో బహదూర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న ఒకేషనల్ కాలేజీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో కళాశాల ప్రారంభోత్సవం ఉంటుందని, కళాశాలకు సంబంధించిన అన్ని రకాల రెగ్యులర్ పోస్టులు త్వరలోనే మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. కళాశాల ప్రారంభం నాటికి కాలేజీ గ్రౌండ్ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని, టాయిలెట్స్ కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళుతున్నారా..? జాగ్రత్త



ప్రచార ఆటోను ప్రారంభించిన కొంపల్లి సీఐ ప్రశాంత్, డీఐ లక్ష్మీనారాయణరెడ్డి

కుత్బుల్లాపూర్: సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొంపల్లి సీఐ ప్రశాంత్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో పండుగకు వెళ్లే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఆటో ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్, డీఐ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ మీ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే స్టేషన్‌కు సమాచారం అందించాలని, ఊళ్లకు వెళ్లే ప్రజలు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచకుండా బ్యాంక్‌లలో భద్ర పర్చుకోవాలన్నారు. ఇంట్లోని ఓ గదిలో నిరంతరం బల్బును వెలిగేలా చూడాలని, సాధ్యమైనంత వరకు ఇళ్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేసుకుంటే ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను గమనించవచ్చని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పనిమనిషికి చెప్పాలన్నారు. అత్యవసర సమయంలో 100 కు లేదా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ 7901113913 / సీఐ 9490617229 / డీఐ 8712663340 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా జగన్‌మోహన్ రావు



పాపూరి జగన్‌మోహన్‌రావు

రంగారెడ్డినగర్: భారతీయ జనతాపార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా సెక్రటరీగా రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన పాపూరి జగన్ మోహన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తనకు పదవి రావడంలో సహకరించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపాలు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

11న రక్తదాన శిబిరం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎన్‌సీఎల్ సింధులో ఈ నెల 11న తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎన్‌సీఎల్ సింధు క్లబ్ హౌజ్‌లో జరిగే ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు కోరారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం తగదు

నిజాంపేట్: ఎస్ఐ, కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోందని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. విద్యార్థి సంఘాల ఏజేసీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ప్రగతిభవన్ ముట్టడిలో భాగంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్‌ను ఆదివారం రాత్రి బాచుపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం అతడిని పరామర్శించిన శ్రీనివాస్, ఏఐటీయుసీ నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు మార్చడంతో యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'కంటి వెలుగు'పై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

దుండిగల్: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 54 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం నేపథ్యంలో సోమవారం కమిషనర్ భోగీశ్వర్లు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 18 నుంచి వంద రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని, కంటి సమస్యలతో ఇబ్బందులు పడే ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ పద్మారావు, పీహెచ్‌సీ ఇన్‌చార్జీ బాలరాజు, ఏఈ ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్ యాదవ్, భారత్ కుమార్, శంకర్ నాయక్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి యాదవ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



కంటి వెలుగుపై చర్చిస్తున్న కొంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం యాదవ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంపై సోమవారం శ్రీశైలంయాదవ్ అధ్యక్షతన ఆయా విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు పథకాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఇందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంగయ్యానాయక్, కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సి లర్లు, కో.ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీఎన్ఆర్ వీజేఐఇటీ కళాశాల విద్యార్థులు

చెరువు ప్రక్షాళన

నిజాంపేట్: బాచుపల్లికి వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్‌వీజేఐఇటీ) కళాశాల బిటెక్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నేక్‌నామ్‌పూర్‌లోని ఇబ్రహీమ్ చెరువును శుభ్రం చేశారు. 120 మంది విద్యార్థులు పాల్గొనగా అధ్యాపకులు డాక్టర్ మాధవి, డాక్టర్ మన్మథ్‌నాథ్ దాస్, డాక్టర్ సునంద, డాక్టర్ నేహా, డాక్టర్ విజయరాఘవన్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ అశోక్ భోగి 'ధ్రువాంశ్' సంస్థ సహకారంతో ఈ చెరువు శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. చారిత్రక చెరువును పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని, కొన్నేళ్ల క్రితం కాలుష్యానికి మారుపేరుగా నిలిచిన ఇబ్రహీమ్ చెరువును, పరిసరాలను లాభాపేక్ష లేకుండా 'ధ్రువాంశ్' ద్వారా పునరుద్ధరించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులతో చెరువు పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేపట్టినట్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ అశోక్ భోగి తెలిపారు.

సంఘటిత ఉద్యమంతోనే హక్కుల సాధన



సమావేశమైన భవన నిర్మాణ కార్మికులు

జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ కార్మికులు హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలని ఏఐటీయుసీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట నల్లమల గిరిప్రసాద్ విజ్ఞాన కేంద్రం భవనంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం సాధారణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన హరినాథ్, సాయిలు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. వారు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని, ప్రతి అమావాస్యకు పనులు నిలిపివేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇఎస్ఐ, పీఎఫ్ పథకాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సామేల్, రాము, మునలయ్య, ఆరీఫ్, బాలాజీ, యూసూఫ్, రాములు, ఆరోగ్యం, యాదగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

'నీరా' కేంద్రాల పేరు మార్చాలి



రమణాచారికి వినతి పత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నీరా విక్రయ కేంద్రానికి వేదామృతం అనే పేరు పెట్టడాన్ని నిరసిస్తూ బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ సలహాదారు రమణాచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ నీరా కేంద్రాలు ఏర్పాటు చేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, వేదామృతం అనే పదం హైందవ జాతిని అవమానించడమన్నారు. వెంటనే వేదామృతం అనే పదాన్ని ఎక్కడ వాడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మంగపతి రావు, గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, గోగులపాటి కృష్ణమోహన్, వక్కలంక శ్రీనివాస్ రావు, కప్పు గిరిప్రసాద్ శర్మ, మంగు రాఘవరావు, ప్రమోద్ కొటారి, జెవిఎల్ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు బచ్‌పన్ విద్యార్థిని ఎంపిక



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన బచ్‌పన్ స్కూల్ విద్యార్థిని లక్ష్మి మనుప్రియ నమూనా

కుత్బుల్లాపూర్: చింతల్, వెంకటేశ్వరనగర్‌కు చెందిన బచ్‌పన్ ప్రైమరీ స్కూల్ విద్యార్థి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. గత డిసెంబరు 3, 4 తేదీల్లో జరిగిన మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో బచ్‌పన్ స్కూల్ విద్యార్థి లక్ష్మీ మనుప్రియ ట్రాన్స్‌పోర్ట్, ఇన్నోవేషన్ నమూనాను రూపొందించి డీఈఓ విజయలక్ష్మి చేతుల మీదుగా అవార్డు, ప్రశం పత్రాలను అందుకుంది. ఉత్తమ నమూనాను ప్రదర్శించిన లక్ష్మి మనుప్రియను ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్మల్‌లోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక గణిత పర్యావరణ, ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ కోటిరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ దీప్తిరెడ్డి విద్యార్థినిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి పాఠశాల పేరు నిలపాలని ఆకాంక్షించారు.

శిలాఫలకంపై ఎంపీ పేరు లేకపోవడం దారుణం



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొంపల్లి కౌన్సిలర్ భైరి శ్రీవిద్య

కుత్బుల్లాపూర్: అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకంపై మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి పేరు ముద్రించకపోవడంపై కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ భైరి శ్రీవిద్య సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని నాగార్జున డ్రీమ్‌ల్యాండ్‌లో ఈ నెల 8న గోదావరి జలాల పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారని, ఎంపీ పేరు లేకుండా శిలాఫలకాన్ని ఏర్పాటు చేసిన హెచ్ఎండబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి



రమేష్ (ఫైల్)

దుండిగల్: విద్యుదాఘాతంతో ఓ పరిశ్రమ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గండిమైసమ్మ గాయత్రి కాలనీకి చెందిన చల్లా రమేష్(56) స్థానికంగా ఉన్న వరలక్ష్మి ఇండస్ట్రీస్‌లో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న ఉదయం డ్యూటీకి వెళ్లిన రమేష్ సాయంత్రం 4 గంటల సమయంలో పరిశ్రమ ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇసుక తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి

డివిజన్ అభివృద్ధికి కృషి

నిజాంపేట్: డివిజన్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని నిజాంపేట్ కార్పొరేటర్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీలో రోడ్డు నెంబర్ 1, 1ఏ, 12 లలో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతూ మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, కార్యదర్శి బాషా, కావ్య అవెన్యూ అధ్యక్షుడు విజయ్, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కాసాని వీరేష్ తదితరులు

నిజాంపేట్: తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో మల్కాజ్‌గిరి టీడీపీ అధ్యక్షుడు శివరాజ్, ఎంపీటీసీ సత్తన్న లతో కలిసి టీటీడీపీ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్, మురళి, రాకేష్, శివకుమార్, రామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాచుపల్లి పెద్ద చెరువును కాపాడాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి పెద్ద చెరువును కాపాడాలని, ప్రాపర్టీ టాక్స్‌ను తగ్గించాలని కోరుతూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ బాచుపల్లి సర్వే నెంబరు 64లోని పెద్ద చెరువు శిఖం భూమిని ఏపీఆర్ ప్రాజెక్ట్ యాజమన్యం కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతోందని, దీనిపై విచారణ చేపట్టి చెరువు స్థలాన్ని పరిరక్షించాలన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లో ఆస్తి పన్ను విధింపులో వ్యత్యాసాలను తొలగిస్తూ ఇళ్లకు 18 శాతం, కమర్షియల్‌కు 36 శాతం విధించారని, అదే సమయంలో జీహెచ్ఎంసీ పరిధిలో 15 శాతం, 30 శాతాలుగా ఉందన్నారు. అధిక ఆస్తి పన్నులు విధించడంతో ప్రజలపై భారం పడుతోందని, ఆస్తి పన్నును తగ్గించేలా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, సీనియర్ నాయకుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి



విద్యార్థులతో కే.పి.విశాల్..



చెదుడుబావి వద్ద విద్యార్థి..



కట్టెలపొయ్యి వద్ద చిన్నారి..

రంగారెడ్డినగర్: మరిచిపోతున్న పల్లెటూరి సంస్కృతి, సంప్రదాయాలు ఒకేచోట కనిపించడం సంతోషంగా ఉందని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్, యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కే.పి.విశాల్ అన్నారు. సోమవారం నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన గ్రామోత్సవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిచిపోతున్న సంప్రదాయాలు తిరిగి జీవం పోసుకోవాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన పల్లెటూరి ఎగ్జిబిట్స్‌లు ఎద్దులబండి, చేదుడుబావి, రచ్చబండ, తాటివనం, చెరువును ఆయన తిలకించి పాఠశాల అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ సందర్భగా నిర్వహించిన భోనాలు, ఒగ్గుకథ, సంక్రాంతి సంబరాలు అందరినీ అబ్బురపరచాయి. నందానగర్ కాలనీ అధ్యక్షులు కార్తీక్‌గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఆర్.బాషా, ప్రిన్సిపాల్ సి.హెచ్.మహెందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.